# రామకృష్ణాపురం రైల్వే గేట్‌కు మోక్షం

## ఆర్వోబి నిర్మాణంపై ముందడుగు

**ఎంపీ వద్దిరాజు చొరవకు దక్కిన ఫలితం**



**చింతకాని జూలై 21ప్రజాజ్యోతి :** చింతకాని మండలంలోని రామకృష్ణాపురం సమీపంలోని 107 రైల్వే గేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవ ఫలితంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్నసమస్యకు పరిష్కారం లభించింది.దానికి తోడు గ్రామస్తులు,స్థానిక ప్రజాప్రతినిధులు

మిగతా 2 లో...



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
బుధవారం | 22 | జులై | 2026 ◆ పేజీలు : 5









# ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకోవాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** (ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి,ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్,ఎన్యూమరేషన్ ప్రక్రియ,ఫిర్యాదుల పరిష్కారం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొ న్నారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ, ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 80 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని,ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందని తెలిపారు. జిల్లాలో శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55 వేలు (5 శాతం) ఉండగా, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో సుమారు 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 20 వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని, ఇదే వేగంతో పనులు కొనసాగిస్తే రానున్న ఐదు రోజుల్లో 90 శాతం డిజిటలైజేషన్

మిగతా 2 లో...

# ప్రతి విద్యాసంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి



**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ**

**జిల్లా యూత్ పార్లమెంట్ నిర్వహించి రాష్ట్ర స్థాయికి ప్రతిభావంతులను ఎంపిక చేయాలి**

**వికసిత్ భారత్, నషా ముక్త్ భారత్ కార్యక్రమాల్లో యువతను విస్తృతంగా భాగస్వాములను చేయాలి**

**ఎనిమిది విభాగాల్లో నషా ముక్త్ భారత్ పోటీలు నిర్వహించాలి**

**ప్రతి నెల కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించాలి**

**పదవ తరగతి, ఇంటర్ తర్వాత ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి**

**ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కెరీర్ గైడెన్స్‌కు అవసరమైన అధ్యయన సామగ్రి సిద్ధం చేయాలి**

2 లో...

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## జి.ఎం చింతల శ్రీనివాస్

**ఘనంగా మాస్ ప్లాంటేషన్ డ్రైవ్**

**10 వేల మొక్కలు నాటిన సింగరేణి, అధికారులు కార్మికులు**





**సత్తుపల్లి జూలై21 (ప్రజాజ్యోతి)** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సింగరేణి జిఎం చింతల శ్రీనివాస్ అన్నారు.బొగ్గు మంత్రిత్వ శాఖ కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ఆదేశాల మేరకు, సింగరేణి యాజమాన్య సూచనలతో సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పార్కింగ్ యార్డ్ ప్రాంగణంలో భారీ స్థాయిలో 'మాస్ ప్లాంటేషన్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఘనంగా మంగళవారం నిర్వహించారు.సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో ఏరియా వ్యాప్తంగా 10వేల మొక్కలను నాటే లక్ష్యంతో

మిగతా 2 లో...

# పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలి: డాక్టర్ మట్టా

**బీసీ బాలుర హాస్టల్ ను పరిశీలించిన మట్టా**



**సత్తుపల్లి జూలై21(ప్రజా జ్యోతి)** పట్టణంలోని లలిత కుమారి హాస్పిటల్ రోడ్ లో గల,బీసీ బాలుర వసతి గృహాన్ని,రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మంగళవారం పరిశీలించారు. పిల్లల రూమ్ లను, బాత్ రూమ్,తయారుచేసిన ఆహారాన్ని,పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల హాస్టల్ ను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్య కరమైన భోజనం విద్యార్థులకు అందించాలని తెలియజేశారు. వర్షాకాల దృష్ట్యా పరిశుభ్రత పై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిశీలించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత వేణు, గ్రాండ్ మౌలాలి, శరత్ చంద్ర, వీరివాడ అపర్ణ, పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు,కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# ప్రతి విద్యాసంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 14 వేల మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమం ద్వారా ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు.అలాగే ఎన్‌సీసీ,ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపాలని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు భారత పార్లమెంట్ లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటన అవకాశం లభిస్తుందని, కొన్ని కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధాన మంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై యువతలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా వ్యాసరచన,చిత్రలేఖనం,తదితర ఎనిమిది రకాల పోటీలను జిల్లాలో నిర్వహించాలని సూచించారు.జిల్లా స్థాయిలో విజేతలకు కేంద్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. యువతకు భవిష్యత్ కెరీర్‌పై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ప్రతి నెల చివరి ఆదివారాల్లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పదవ తరగతి,ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు,రక్షణ రంగం, ఇతర వృత్తి రంగాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు.కెరీర్ గైడెన్స్ కార్యక్రమాల సమర్థ నిర్వహణ కోసం సంబంధిత శాఖలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, అవసరమైన అధ్యయన సామగ్రి, పరీక్షల విధానం, కెరీర్ మార్గదర్శక సమాచారాన్ని సిద్ధం చేసి విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి ,లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ. రవి ప్రసాద్, జిల్లా ఇంటర్మీడి యేట్ విద్యాధికారి కె.రవి బాబు,జిల్లా విద్యాధికారి,జిల్లా యువజన క్రీడల అధికారి టి. సునీల్ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ రావు, అడిషనల్ డిఎంహెచ్ఓ. ,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




(మొదటి పేజీ తరువాయి...)

విస్తృత స్థాయిలో వృక్షారోపణ చేపట్టారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు సింగరేణి సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఉద్యోగి, కార్మికుడు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు, పర్యావరణ విభాగం ప్రతినిధులతో పాటు ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్. సుధాకర్, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, సి ఎం ఓ ఏ ఐ వైస్ ప్రెసిడెంట్ డి. రమేష్ బాబు పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో సింగరేణి యాజమాన్యానికి తమ పూర్తి సహకారం ఉంటుందని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, సత్తుపల్లి ఏరియాను మరింత హరితమయంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు,యూనియన్ సంఘ బాధ్యులు ,కార్మికులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

లక్ష్యాన్ని చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన మేరకు ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) లక్ష్యం మేరకు ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరుకి అందించిన ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో బీఎల్‌వోలు ప్రజలకు సహకరించాలని,ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం,కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, ఇతర ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అమ్మపాలెం కుంచపర్తి సరిహద్దుల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడి

**శాంతి భద్రతలు కాపాడుటయే నా బాధ్యత -ఎస్సై కవిత**




**వేంసూర్ జూలై 21 ప్రజా జ్యోతి న్యూస్** మండల పరిధిలోని అమ్మపాలెం కుంచపర్తి గ్రామ సరిహద్దుల్లో పేకాట రాయుళ్ల అరెస్టయ్యారు గ్రామ సరిహద్దుల్లో పేకాట స్థావరాలపై ఆకస్మికంగా పోలీసులు దాడి నిర్వహించారు కొందరిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ కవిత తెలిపారు వేంసూరు మండలం లో ఎస్సై కవిత ఛార్జ్ షీట్ తీసుకుని దగ్గర్నుంచి గ్రామాల్లో శాంతిభద్రతలు చాలా చక్కగా నడుస్తున్నాయి ఎటువంటి సమస్య లేకుండా శాంతి భద్రతలను కాపాడుకుంటూ వస్తున్నారు ప్రతి గ్రామ పంచాయతీ లపై ఆమె ఆరా తీస్తున్నారు ఎక్కడిక్కక్కడ పోలీసులు పేకాట వస్తావురాలపై దాడి నిర్వహించి అరెస్ట్ చేస్తున్నారు ప్రజలు జూదాలకు వల్ల తమ కుటుంబాలను పాడు చేసుకుంటున్నారని అప్పుల పాలవుతున్నాయని చివరికి ఇవి పెద్ద గొడవలుగా మారే అవకాశం ఉందని శాంతి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎక్కడ ఎటువంటి పేకాటలు ఆడుకుండా ఎటువంటి జూదాలు జరగకుండా ఎస్ఐ కవిత మండలాన్ని శాంతిభద్రత ఉంచుతున్నారు అని ప్రజలుఅభినందనలు తెలియజేసారు

## రామకృష్ణాపురం రైల్వే గేట్‌కు మోక్షం

(మొదటి పేజీ తరువాయి...)

చేసిన విజ్ఞప్తులు, వివిధ పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందన లభించింది. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్, ఇతర అధికారులతో కలిసి రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ అంశం.. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి , ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్ మాట్లాడుతూ.. ఆర్ఓబీ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందజేస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే సర్వే పనులు ప్రారంభించి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరిస్తే ఆర్ఓబీ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఎంపీ వద్దిరాజు కృషి..**

రామకృష్ణాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులంతా ఏడాది క్రితం ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రవిచంద్ర స్పందించి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రామకృష్ణాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. ఆ మేరకు కొద్ది రోజులకే రైల్వే మంత్రి స్పందించి ఎంపీ రవిచంద్ర కు లేఖ రాశారు. బ్రిడ్జి నిర్మాణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, దీనిపై తొందరలో సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇస్తూ మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిత్వ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామస్తులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు.

## మర్లపాడు రాయుడుపాలెం రహదారిపై ఎండిపోయిన చెట్లు

**విరిగి పడిపోయే ప్రమాదం ఉందన్న స్థానికులు**

**భయంతో ప్రయాణం చేస్తున్న వాహనదారులు**



**వేంసూర్ జులై 11 ప్రజాజ్యోతి** వేంసూరం మండలంలోని మర్లపాడు నుండి తిరువూరు వెళ్లే రహదారిలో రాయుడుపాలెం వెళ్లే రహదారి వద్ద రోడ్డు ఇరువైపులా చెట్లు ఉండి చల్లని గాలి వీసి వాహనదారులకు సౌఖ్యాన్ని అందాన్ని కలిగిస్తున్నాయి కానీ అందులోనే కొంత ప్రమాదం కూడా ఉందనే స్థానికులు చెప్తున్నారు ముఖ్యంగా రహదారిపై ఉన్న చెట్లు చుట్టుపక్కల ఉన్న చెట్లు కొన్ని బాగా ఎండిపోయి ఉన్నవి అవి విరిగిపోతూ అక్కడక్కడ వాహనదారులు పైపడే ప్రమాదం ఉందని వాహనదారులు చెప్పుకొస్తున్నారు మరి ముఖ్యంగా ఎండిపోయిన చెట్లు ఇరువైపులా మార్గమధ్యలో ఉన్నందున అవి ఎప్పుడో ఎలాగా పడతాయో తెలియని పరిస్థితిలో ఉన్నారు వాహనదారులు ఒకవేళ అవి విరిగిపడే ప్రమాదం ఉంది కాబట్టి వాహనదారులు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దయచేసి అధికారులు వాటి యొక్క తీసివేతకు పూనుకోవాలని చెప్పికొస్తున్నారు మొత్తానికి ప్రధాన రహదారిన టువంటి తిరువూరు వెళ్లే ఈ రహదారిలోప్రమాదానికి గురి చేసే ఈ చెట్లువలన చాలా ప్రమాదం కాబట్టి త్వరలోనే వాటిని తీసేసి వాహనదాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని స్థానికులు ప్రజలు కోరుతున్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం అమానుషం

**కాంగ్రెస్ నాయకుడు రాధా కృష్ణమూర్తి.**



**నేలకొండపల్లి, జూలై 21 ప్రజా జ్యోతి :** నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై, సామాజిక వేత్త వాంగ్ చుక్ ను పోలీసులు అరెస్టు చేయడానికి నిరసిస్తూ విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణా రహిత లాఠీచార్జి, బాష్పవాయువును ప్రయోగించడాన్ని నిరసిస్తూ మంగళవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా జరిగిన నిరసన నాయకులు రాధా కృష్ణమూర్తి మాట్లాడుతూ... విద్యార్థులపై పోలీసులు జరిపిన అమానుష దాడి ప్రజాస్వామ్య విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. నిరసనకారులపై లాఠీఛార్జికి ఆదేశించిన పోలీసు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత 23 రోజులుగా సోనమ్ వాంగ్ చుక్ ఢిల్లీలో నిరసన దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా, విద్యార్థుల గొంతు నొక్కాలని చూడటం విచారకరమన్నారు. మోదీ ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల డిమాండ్లను అంగీకరించాలని, అరెస్టయిన వారందరిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని వెంటనే రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్షల పేపర్ లీకేజీ కారణంగా అనేకమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది మానసిక క్షోభకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థుల నాయకులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

- రిమాండ్ కు తరలింపు ఇన్స్పెక్టర్ భానుప్రకాష్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక నిందితుడు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగానే గుర్తించి, వాటి లొకేషన్‌ను తన సెల్‌ఫోన్‌లో సేవ్ చేసుకొని, రాత్రి సమయంలో రుద్రంకోట లోని ఓ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు ఇతర విలువైన వస్తువులను చోరీ చేసిన కేసులో నిందితుడు లంజపల్లి శేఖర్ టోనీ (31), ఆటో డ్రైవర్, నివాసం చర్చి కాంపౌండ్, ఖమ్మం, స్వస్థలం ముత్తారం గ్రామం, ముదిగొండ మండలం ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ తెలిపారు. దొంగతనాలకు ఉపయెగించే 04 UA 6914 నంబరు గల బజాజ్ డీజిల్ ఆటోను, 31.263 గ్రాముల బంగారు స్వాతి హారం, 9.530 గ్రాముల బంగారు జూకాలు,మాటీలు, ఒక మోటరోలా ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్, ఒక వివో సెల్‌ఫోన్,స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు గతంలో ఖమ్మం అర్బన్,కొనిజర్ల,చింతకాని,రఘునాథ పాలెం తదితర ప్రాంతాల్లో జరిగిన పలు ఇంటి దొంగతనాలు,గొలుసు లాక్కెళ్లిన కేసుల్లో కూడా తన ప్రమేయం ఉన్నట్లు అంగీకరించాడని,నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం రెండవ జే ఎఫ్ సి ఎం కోర్టులో హాజరు పరచడం జరిగినదని తెలిపారు.ప్రజలు తమ ఇళ్లను విడిచి బయటకు వెళ్లే సమయంలో తలుపులకు నాణ్యమైన తాళాలు వేయడం,సమీప బంధువులు లేదా పొరుగువారికి సమాచారం ఇవ్వడం,సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఢిల్లీ ఘటన కు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

- నిరసన తెలిపే విద్యార్థుల పై దాడి సిగ్గుచేటు
- జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు



**నేలకొండపల్లి, జూలై 21 ప్రజా జ్యోతి:** ఢిల్లీ ఘటన కు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు డి మాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...నిరసన తెలిపేందుకు వచ్చిన విద్యార్థుల పై లాఠీ చార్జి, టియర్ గ్యాస్ ప్రయోగాలు చేయటం సిగ్గు చేటు అన్నారు.ప్రజాస్వామ్యం ను ఖూనీ చేస్తుందన్నారు. నిరసన తెలిపే హక్కు . లేకుండా చేయాలని చూస్తే కేంద్ర ప్రభుత్వం కు తగిన గుణపాఠం . తప్పదని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీ పై దేశ వ్యాప్తంగా నిరసన చేపట్టారని పేర్కొన్నారు. విద్యార్థుల ఉద్యమాన్ని లాఠీ చార్జీలతో ఉద్యమాన్ని అణిచివేయాలని చూడటం మూరఖత్వం అన్నారు. విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుదని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని అగ్రహాం వ్యక్తం చేశారు. సరైన దర్యాప్తు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పై లాఠీ చార్జీ కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.

## చెరువు కాపాలాదారులను బెదిరించినందుకు ముగ్గురు పై కేసు నమోదు

**నేలకొండపల్లి, జులై 21 ప్రజా జ్యోతి:** చెరువు కాపాలాదారులను చంపుతామని బెదిరించిన కేసులో ముగ్గురు పై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం చెరువు కు కాపాలాదారులు గా ఉంటున్న బొడ్డయ్య, మస్తాన్, సైదులు, వీరయ్య అనే వారిని చెరువుమాధారం గ్రామానికి చెందిన వై. సైదులు, ఆర్.మధార్, చిన్నతండా కు చెందిన కే.శ్రీను లు అర్ధరాత్రి చెరువు కట్ట వద్ద కు వెళ్లి..కాపాలాదారులను చంపుతామని బెదిరించారు. చెరువు పై కాపాలా ఉండటానికి వీలు లేదని హెచ్చరించారు. చెరువులో వలలు లేకుండా చేస్తామని...వలలను కోస్తామని హెచ్చరించారు. అసభ్యకరంగా తిడుతూ.కాపాలాదారులను భయపెట్టారని.. అంతే కాకుండా చెరువులోని చేపలను లూటీ చేసేందుకు గ్రామస్తులను ప్రోత్సాహిస్తున్నారని సోసైటీ చైర్మన్ భాసిం స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి ముగ్గురు పై కేసు నమోదు చేశారు.

## అధ్యక్షతన జాతీయ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జన్మదినోత్సవ సందర్భంగా కేక్ కటింగ్ విస్తృత స్థాయి సమావేశం

- కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జన్మదినోత్సవ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మరియు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచినారు.అనంతరంటి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , ఏ ఐ సి సి కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ల సూచన మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులతో,మండల పట్టణ అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేయనైనది.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తో కలిసి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ( సర్ ) ప్రక్రియ జరుగుతున్న సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లు అప్రమత్తంగా ఉండాలని బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి రోజూ ప్రతి ఓటర్ ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకున్నారా తీసుకుంటే తిరిగి ఇచ్చారా లేదా అని తెలుసుకొని సాయంత్రం 05.00 గంటలకు బూత్ లెవెల్ సూపర్ వైజర్ లకు రిపోర్ట్ అందజేయాలని తద్వారా కనెక్ట్ సెంటర్ కు అందజేయాలని అదే విధంగా బూత్ ల వారీగా యాక్టివ్ గా పని చేసిన మొదటి 100 మంది బూత్ లెవెల్ ఏజెంట్లకు రాహుల్ గాంధీ తో ఫోటో సెషన్ నిర్వహిస్తామని అధినాయకత్వం సూచించిందని అన్నారు ఈనాటి నుండి 03-08-2026 వరకు రోజువారి రిపోర్ట్ అందజేయాలని సూచించారు, అదే విధంగా బూత్ లెవెల్ ఏజెంట్లను, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లకు తగు సలహా సూచనలు చేయాలని మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు సయ్యద్ గౌస్,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,మొక్కా శేఖర్ గౌడ్,పుచ్చకాయల వీరభద్రం,జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు పట్టాభి,పసుపులేటి దేవేందర్,కిలారు అనిల్ కుమార్,కొమ్మినేని రమేష్ బాబు,ప్రభావతిరెడ్డి, హరిత రెడ్డి,ఝాన్సీ,స్వరూప,వినోద,రేణుక,నాగరాజు, కర్నాటి రామారావు,పులిబండ్ల చిట్టిబాబు,కంచర్ల వెంకటనర్సయ్య,మంకెన శ్రీనివాసరావు, హఫీజ్,గంగిశెట్టి ప్రసాద్,చిన్నారావు,అశోక్,సీతారాములు తదితర నాయకులు పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ మీటింగ్

- గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి
- జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి,డాక్టర్ డి రామారావు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి పి సి పి ఎన్ డి టి , అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలో పి సి పి ఎన్ డి టి చట్టం అమలు,స్కానింగ్ కేంద్రాల పనితీరు, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిరోధించేందుకు చేపడుతున్న చర్యలు, నమోదిత అల్ట్రాసౌండ్ కేంద్రాల తనిఖీలు,ఫామ్ ఎఫ్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ డి.రామారావు మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని,గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం,చేయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలు,వైద్యులు, సంబంధిత వ్యక్తులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలోని అన్ని నమోదిత అల్ట్రాసౌండ్ కేంద్రాలు ఫామ్ ఎఫ్ రికార్డులను పూర్తిస్థాయిలో,సక్రమంగా నిర్వహించాలని, చట్టంలోని అన్ని నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. జిల్లా టాస్క్ ఫోర్స్ ద్వారా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘించే కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.గత మీటింగ్ ముగిసిన తర్వాత నుంచి అనగా ఏప్రిల్ ఒకటో తారీకు నుంచి ఇప్పటివరకు మొత్తం 13 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ కోసం వచ్చాయని వీటిలో ఐదు రెన్యువల్ కి సంబంధించినవి,ఇంకా 13 దరఖాస్తులు సవరణల నిమిత్తమై రావడం జరిగింది.ఆడ శిశువు రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ,సమాజంలో బాలికల పట్ల వివక్షకు తావు లేకుండా ప్రతి కుటుంబం ఆడబిడ్డను గౌరవించాలని కోరారు. బేటీ బచావో బేటీ పడావో" కార్యక్రమం లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు,ప్రజలు,స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు, డాక్టర్ ఎల్ వేణుగోపాల రెడ్డి, పి ఓ., ఎమ్ హెచ్ ఎన్, డాక్టర్ బిందు శ్రీ పిఓ , డాక్టర్ జి లక్ష్మీనారాయణ డి ఐ ఓ , డాక్టర్ ఎస్ రేష్మ బేగం ఐఎంఏ ప్రెసిడెంట్ , డాక్టర్ బి శ్రీవిద్య అసిస్టెంట్ ప్రొఫెసర్ , డాక్టర్ అరుణాదేవి పిఓ ఎన్సిడి, డాక్టర్ ప్రదీప్ బాబు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ఎం దుర్గా డిపిఓ, కే వెంకటేశ్వర్లు డి ఎం ఓ ,మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు,రేడియాలజిస్టులు,గైనకాలజిస్టులు, న్యాయ నిపుణులు, జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారులు,సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలకు ప్రయారిటీ ఇవ్వండి రెహనా కమల్

- ఎల్.నినో ప్రభావం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**సత్తుపల్లి జూలై21(ప్రజా జ్యోతి)** ఆరుతడి పంటలు వేసి,రైతులు అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లతో, కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గే పరిస్థితులు ఉన్నందున, ఆరుతడి పంటలను మాత్రమే పండించాలని, పంటల కూడా వర్షం లేకపోయినా తట్టుకునే విధంగా ఉండాలని, తక్కువ నీటి ప్రభావానికి అనుకూలంగా ఉండే పంటలను వేయాలని సూచించారు. భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఉండాలని సిబ్బందికి సూచించారు. పట్టణానికి త్రాగునీరు మిషన్ భగీరథ ద్వారా, బోర్ వేల్ ద్వారా అందిస్తున్నామని, భూగర్భజలం తగ్గినందువలన ప్రజలు నీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నసీమా షరీఫ్,జొన్నలగడ్డ శ్రీనివాసరావు, బండారు శరత్చంద్ర జగన్నాథం శ్రీను, వీరివాడ అపర్ణ, మేనేజర్ శ్రీనివాసరావు లు ఉన్నారు.



## విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి

- నేలకొండపల్లి విద్యుత్ ఏఈ రవి



**నేలకొండపల్లి, జూలై 21 (ప్రజా జ్యోతి):** ఈనెల 23 న రాజేశ్వరపురం లో జరిగే విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ను సద్వి నియోగంచేసుకోవాలని నేలకొండపల్లి ఏఈ జీ.రవి సూచించారు. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కోరకు నిర్వహించే సదస్సు లో వినియోగదారులు నేరుగా వారి సమస్యలను తెలియజేయవచ్చునని అన్నారు. గ్రామాలలో ఉన్న సామూహిక విద్యుత్ సమస్యలను కూడ ఫోరం దృష్టికి తీసుకవచ్చి తగిన పరిష్కారం పొందవచ్చునన్నారు. నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలలోని బచ్చోడు. కూసుమంచి, పాలేరు, రాజేశ్వరపురం, నేలకొండపల్లి సెక్షన్లలోని విద్యుత్ వినియోగదా రులు, 'రైతులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. గురువారం ఉదయం 10:30మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ను కొనసాగిస్తారని తెలిపారు. ఈ వేదిక కు సీజీఆర్ఎ-1 వరంగల్ చైర్ పర్సన్ జీ.నాగప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యుత్ వినియోగ దారులు, ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పేపర్ లీకేజీలను అరికట్టలేక, న్యాయం కోరిన విద్యార్థి

- యువతపై లాఠీచార్జ్ చేస్తున్న చేతకాని బీజేపీ ప్రభుత్వం
- ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్




**ఖమ్మం (ప్రజా జ్యోతి)** గత 12 సంవత్సరాల కాలంలో దా దాపు 100కు పైగా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రశ్నా పత్రాల లీకేజీలు చోటుచేసు కుని లక్షలాది మంది విద్యా ర్థుల, యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకు నేందుకు న్యాయం కోరు తున్న విద్యార్థి, యువతపై దమనకాండకు పాల్పడు తోందని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ తీవ్రంగా విమర్శించారు.నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై న్యాయ విచారణ జరిపి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయా లని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యా ర్థులు, యువతపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.దేశంలోని విద్యార్థులు, యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని సాయికుమార్ తెలిపారు. విద్యా ర్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యా ప్తంగా యువత ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపుని చ్చారు.రాబోయే రోజుల్లో దేశంలో ఎక్కడ విద్యార్థులకు, యువతకు అన్యాయం జరిగినా అక్కడ యువజన కాంగ్రెస్ ముందుండి పోరాటం చేస్తుం దని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వేజెండ్ల సాయికుమార్ స్పష్టం చేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- విద్యార్థులపై లాఠీచార్జి బిజెపి నియంత్రత్వా నికి నిదర్శనం



**బోనకల్, జులై 21 (ప్రజా జ్యోతి ):** కేంద్రంలోని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులపై బిజెపి ప్రభుత్వం లాఠీచార్జి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్ తెలిపారు. నీటి పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ లో నైతిక బాధ్యత వహించి కేంద్రంలోని బిజెపి విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న విద్యా ర్థులపై లాఠీచార్జి చేయటాన్ని నిర సిస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వ ర్యంలో స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో మంగళ వారం గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతతత్వ విధానాలను అమలు చేస్తూ ప్రజాస్వా మ్యతంగా నిరసన తెలుపుతున్న విద్యా ర్థులపై రాఠీచార్జి చేయటం దారుణం అన్నారు. నీటి పరీక్ష ప్రశ్నా పత్రం లీకేజీ వలన కొన్నివేల మంది విద్యా ర్థులు నష్టపోయారు అన్నారు. దానికి నైతిక బాధ్యత బిజెపి ప్రభుత్వం వహిం చాలన్నారు. బిజెపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను మతోన్మాదులతో నింపు తుందన్నారు. అందువల్లే నీటి ప్రశ్న పత్రం లీకేజీ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధా నాల వల్ల విద్యా వ్యవస్థ సర్వనాశనం అవుతుందని దాని ఫలితంగా నిరు ద్యోగ సమస్య పెరిగిపోతుందని ఆందో ళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తానా విద్యా ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. బిజెపి నియంతృత్వ విధానా లతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని విమర్శించారు. శాంతియు తంగా నిరసన తెలుపుతున్న విద్యా ర్థులపై లాఠీచా ర్జి చేయటం బిజెపి మతోన్మాద విధానాల్లో భాగమే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంధం శ్రీనివాసరావు, బోయినపల్లి వీరబాబు, పంతంగి శ్రీని వాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, మచ్చ గురవయ్య, బోయినపల్లి సూర్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మధిరను రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుదాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత



**మధిర ప్రజా జ్యోతి** పరిశుభ్రతలో మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుదామని, ఇందుకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పిలుపునిచ్చారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహ ణను సరికొత్త ప్రమాణాలతో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో మున్సిపల్ కార్యాల యంలో 'మన మధిర – మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ప్రతిష్టాత్మకమైన 90 రోజుల శానిటేషన్ యాక్షన్ ప్లాన్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వచ్ఛ మైన మధిర లక్ష్యంతో రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. ఈ బృహత్తర కార్యక్రమం కేవలం అధికారుల బాధ్యతే కాకుండా, ప్రతి పౌరుడు తన వంతు కర్తవ్యంగా భావించి భాగస్వాములైనప్పుడే పరిపూర్ణ విజయవంతం అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలో భాగంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టనున్నట్లు సుజాత వెల్లడిం చారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టు కింద 4, 8, 17, 18, 19 వార్డులను ఎంపిక చేసి చెత్త సేకరణ విధానాన్ని మరింత క్రమబద్ధీకరించామన్నారు. ఈ వార్డుల్లో ప్రత్యేక షెడ్యూల్ అమలు చేస్తున్నామని, సోమవారం, బుధవారం, గురువారం, శనివారం రోజుల్లో తడి చెత్తను, అలాగే మంగళవారం, శుక్రవారం రోజుల్లో పొడి చెత్తను సేకరించనున్నట్లు తెలిపారు. ఈ సరికొత్త విధానం విజయవంతం కావడా నికి పట్టణ ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. గృహిణులు, పౌరులు ఎవరికి వారు బాధ్యత తీసుకొని, ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల చైతన్యం, అధికారుల పర్యవేక్షణతో మధిరను రాష్ట్రంలోనే నంబర్ వన్ ఆదర్శ మున్సిపాలి టీగా తీర్చిదిద్దేందుకు ఈ 90 రోజుల యాక్షన్ ప్లాన్ ఎంతగానో దోహదపడుతుం దని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోన ధని కుమార్, మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ పాల్‌తో పాటు వార్డు కౌన్సిలర్లు బి. రమణ నాయక్, బి. రేవతి, జి. మాధురి, ఎస్కె. రసీద్దున్, ఎన్.రాజేశ్వరి, యం. వినయ్ కుమార్, బి. విజయ్ కుమారి, డి. నాగార్జున, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

## కారేపల్లిలో డివైఎఫ్ఐ ప్రదర్శన

- మోడీ హయాంలో భ్రష్టు పట్టిన విద్యారంగం సీపీఐ(ఎం).




**కారేపల్లి, జూలై 21, ప్రజా జ్యోతి:** శాంతియుతంగా పార్లమెంటుకు లాంగ్ మార్చ్ చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై మోడీ ప్రభుత్వం లాఠీఛార్జ్, నీటి ఫిరంగులు, భాష్ప వాయు ప్రయోగించడాన్నినిరసిస్తూ సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర సన ప్రదర్శన నిర్వహించారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్లో నిరసన సభను డివై ఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈస భలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండ ల కార్యదర్శి కే.నరేంద్ర లు మాట్లాడుతూ దేశంలో విద్యారంగం అధ్వాన్న పరి స్థితులు నెలకొన్నాయన్నారు. జాతీయ పరీక్షల లీకేజీలకు కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని నెల రోజులుగా విద్యార్థులు, నిరు ద్యోగులు, యువకులు పోరాటాలు నిర్వహిస్తున్నా మోడీ ప్రభుత్వం కనీసం స్పందించటం లేదన్నారు. మోడీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ సామాజికవేత్త సోనం వాంగ్ చుక్ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోవటంతో యువత శాంతియుతంగా పార్లమెంట్ కు మార్చ్ పిలుపునిచ్చిందన్నారు. నిరసన తెల్పుతున్న విద్యార్థులపై లాఠీ చార్జ్, నీటి పిరం గులు, భాష్ప వాయు గోళాలు ప్రయోగించడం మోడీ ప్రభుత్వ నిరంకుశ తత్వా నికి నిదర్శనమని విమర్శించారు. మోడీ అధికారంలో వచ్చిన 12 సంవత్సరాల కాలంలో 14 ప్రశ్నాపత్రాల లీకులు జరిగాయని దీంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకొని తర్ఫీదు పొందిన యువత సమయం, వయస్సు, వారి తల్లిదం డ్రుల కష్టం వృధా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల లీకేజీలతో జీవి తంపై భరోసా లేక అనేకమంది ప్రాణాలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకుల దొంగలపై అరకొర చర్యలు తప్ప విద్య వ్యవస్థకు ప్రాతి నిధ్యం వహిస్తున్న విద్యాశాఖ మంత్రి పై కనీసం చర్యలు తీసుకోకపోవడం మో డీ ప్రభుత్వ చిత్తశుద్ధి శంకించాల్సి వస్తుందన్నారు. విద్యావ్యవస్థపై ప్రభుత్వ తీ రుపై అసంతృప్తి తోటే పార్లమెంట్ మార్చ్ కు పూనుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే దేశ వ్యాప్త ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్, కాకాటి వృద్ధి, వెంకీ, నవీన్ ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మేకలతండాలో ఘనంగా సీత్లా పండగ వేడుకలు

**కారేపల్లి, జూలై 21, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం మేక లతండా లో సీత్లా (దాటోడీ) పండుగను మంగళవారం ఘ నంగా నిర్వహించారు. పాడిపంటల సమృద్ధికి బంజార గిరి జనులు ఈ దాటోడి వేడుకను నిర్వహించటం ఆనవాయితీ. గిరిజనులైన లంబాడీలు (బంజారాలు) ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే మొదటి పండుగ సీత్ల పండుగ, ఆ రోజు సీత్లా భ వానీని పూజిస్తారు. కలరా వంటి మహమ్మారులు ప్రబలకుం డా భవానీ దేవత కాపాడుతుందని బంజారాల నమ్మకం. ఆ షాఢమాసంలో మంగళవారాలలో ఈ పండుగను జరుపుతా రు. తండాల సరిహద్దులో (పొలిమేరల) సీత్ల భవానీని ప్రతిష్టి స్తారు. పురుషులంతా డప్పు వాయిద్యాలు వాయిస్తూ, మహి ళలు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసుకుంటూ అమ్మవా రిని ప్రతిష్ఠించిన ప్రదేశానికి వెళ్తారు. అమ్మవారికి నైవేద్యం గా గుగ్గిళ్లు, లాప్సి పాయసం సమర్పిస్తారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చి వాటి పేగుల పైనుంచి పశువులను దాటిస్తారు. అం దుకనే దీనిని దాటోడీ అని అంటారు. దీని వలన పశుసంపద కు ఎలాంటి వ్యాధులురాకుండా పాడిపంటలు పండుతాయ ని గిరిజనుల నమ్మకం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఖ మ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రాంమ్మూర్తి దంపతు లు, గ్రా మ మహిళలు, పురుషులు పాల్గొని పూజలు నిర్వహించారు.



# పాఠశాలల సమీపంలోని దుకాణాలపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**ముదిగొండ జులై 21(ప్రజా జ్యోతి )** ముదిగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మురళీ ఆదేశాల మేరకు మంగళవారం ముదిగొండ, న్యూ లక్ష్మీపురం ప్రాంతాల్లోని పాఠశాలల సమీపంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల వద్ద ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, పరిసర ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులను మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తుల బారిన పడకుండా కాపాడడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు.



పాఠశాలలకు సమీపంలో గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని దుకాణదారులకు స్పష్టంగా హెచ్చరికలు జారీ చేశారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, క్రయవిక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఇన్స్పెక్టర్ మురళీ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి పాఠశాలల సమీపంలో గుట్కా, సిగరెట్లు విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, ప్రజలు కూడా ఇలాంటి అక్రమ విక్రయాలపై సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# ధర్మేంద్ర ప్రధాన్ కాదు మోదీ రాజీనామా చేయాలి

- కాక్రోచ్ లపై దాడిని ఖండిస్తున్నాం
- ముదిగొండ మండల అధ్యక్షులు బంక వీరభద్రం



**ముదిగొండ జులై 21 (ప్రజా జ్యోతి )** ఢిల్లీలో శాంతియుతంగా ర్యాలీ నిర్వగించిన విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీ ఛార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని తెలంగాణ బీఎస్పీ ముదిగొండ మండల అధ్యక్షులు బంక వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీకి బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలోలో 22 రోజులుగా జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసనకు దిగితే ఎలాంటి చర్చలు ప్రారంభించని కేంద్రం... శాంతియుత ర్యాలీ నిర్వహిస్తే మాత్రం పోలీసులు, పారామిలటరీ దళాలతో అణచివేయడం దారుణమని ఆయన మండి పడ్డారు. ఇంతటి అలజడికి కారణమైన మోడీ తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని.. అలాంటి హక్కును కాలరాయడం బీజేపీకి కొత్తేమీ కాదని ఆయన అన్నారు. దేశంలో అశాంతి, అన్ని వర్గాల ప్రజలను మోసగిస్తూ, విద్యార్థుల జీవితంలో మట్టికొడుతున్న మోదీ లీకుల సర్కారును ఇంటికి సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు.

# నూతన తాహసిల్దార్ గా ఏ. రమేష్

- ప్రస్తుత బోనకల్ తహసిల్దార్ చల్లూరి సుధాకర్ కల్లూరుకు బదిలీ
- తహసిల్దార్ తో పాటు గిర్ధవర్ - 1, గిర్ధవర్ - 2 బదిలీ
- అవినీతి ఆరోపణలే వీరి బదిలీకి ప్రధాన కారణం
- చర్చించుకుంటున్న అంటున్న మండల ప్రజలు

**బోనకల్, జులై 21 (ప్రజా జ్యోతి ):** బోనకల్ మండల నూతన తాహసిల్దారుగా ఏ రమేష్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం బోనకల్ తాహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న చల్లూరి సుధాకర్ బదిలీపై కల్లూరు కు వెళ్ళనున్నారు. ఆయన స్థానంలో కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న ఏ రమేష్ బదిలీపై బోనకల్ తాహసిల్దారుగా రానున్నారు. అయితే బోనకల్ తాహసిల్దార్ తో పాటు గిర్ధవర్ –1, గిర్దావర్ – 2 ఒకేసారి బదిలీ కావటం విశేషం. వారి స్థానంలో కూసుమంచి మండలం నుండి గిర్దావర్ – 1గా పి మురళి, గిర్ధవర్ –2 గా ఏన్కూరు నుండి ఏ పవన్ కుమార్ బదిలీ పై బోనకల్ కు రానున్నారు. ఒకేసారి బోనకల్ తాహసిల్దార్ కార్యాలయం నుండి ముగ్గురు బదిలీ కావడం పలువురిని ఆశ్చర్యం కలిగించింది. అయితే గిర్ధవర్– 1 గా విధులు నిర్వహిస్తున్న నరసింహారావు బదిలీపై బోనకల్ కు వచ్చి రెండు నెలలు పూర్తి కాకముందే బదిలీ కావడం విశేషం.. మట్టి మాఫియాను, ఇసుక మాఫియాను అరికట్టడంలో వీరు విఫలమయ్యారంటూ మండలంలో భారీగా వీరిపై ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తుంది.? అవినీతి ఆరోపణల ప్రధాన కారణంతోనే వీరిపై బదిలీ వేటు పడిందని మండలంలో భారీగా చర్చించుకుంటున్నారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి



**నేలకొండపల్లి, జులై 21 ప్రజా జ్యోతి :** ప్రమాదవశాత్తు తో విద్యుత్ షాకు కు గురై ఓ రైతు మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బోదులబండ గ్రామానికి చెందిన అనంతు వీరయ్య (55) అనే రైతు మంగళవారం పొలం వద్ద మోటార్ స్విచ్ వేసేందుకు వెళ్లాడు. సాగు నీటి సరఫరా కోసం స్విచ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ కు గురైయ్యాడు. దీంతో అక్కడిక్కడే రైతు మృతి చెందాడు. మృతుడు కు భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంను స్తానిక ప్రభుత్వ హస్పిటల్ లో పోస్టుమార్డమ్ ను నిర్వహించారు.

# ఇంచార్జి మండల పంచాయతీ అధికారి రామకృష్ణ కి సిపిఎం నాయకుల సన్మానం

- ముదిగొండ గ్రామ సర్పంచ్ కట్టాకూరి ఉపేందర్



**ముదిగొండ జులై 21 (ప్రజా జ్యోతి )** ముదిగొండ గ్రామపంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తు మండల ఇంచార్జి ఎంపిఓ.తాత్కాలిక పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన చిట్టూరి రామకృష్ణ.... ఈసందర్భంగా రామకృష్ణ ను సన్మానించి అభినందనలు తెలిపిన సర్పంచ్ కట్టకూరి ఉపేందర్ ఈ కార్యక్రమం లో పాల్గొన్న వార్డు నెంబర్లు మెట్టెల సతీష్,యస్ కె దస్తగిరి, గ్రామస్తులు మనకేన దామోదర్, రావులపాటి స్వరాజ్, చెరుకూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



**సత్తుపల్లి జూలై 21(ప్రజా జ్యోతి)** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి, అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి,ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా మాట్లాడుతూ విధివిధానాలతో కాంగ్రెస్ పాలనను ముందుకు నడిపిస్తున్నారని,మంచి నాయకుడు పుట్టినరోజులు జరుపుకోవడం అదృష్టమని ,ఆ భగవంతుడు ఆయనకు ఆరోగ్యాన్ని, అష్టైశ్వర్యాన్ని అందజేయాలని,ముందు ముందు ప్రజలకు మరింత సేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వార్డ్ కౌన్సిలర్ మౌలాలి, బీసీ లీడర్ నారాయణవరపు శ్రీనివాస్, ఆంగోతు రామారావు పింగళి సామేలు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# సమరశీల కమ్యూనిస్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య - సీపీఎం



**కారేపల్లి, జూలై 21, ప్రజా జ్యోతి:** సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సింగరేణి మండలం గుంపెళ్లగూడెంకు చెందిన ఎర్రబెల్లి లక్ష్మయ్య (60) మంగళవారం మృతి చెందారు. కొంత కాలం అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మయ్య పరిస్థితి విషయమించటం మృతి చెందారు. ఆయన మృతదేహంలోపై సీపీఐ (ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, సీనియర్ నాయకులు తుమ్మోజు రాంమూర్తిలు సీపీఎం పతాకాన్ని కప్పి నివాళ్లు ఆర్పించారు.వారు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించటంలో సమరశీలమైన కమ్యూనిస్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య అని కొనియాడారు. మాదారం, గుంపెళ్లగూడెం ప్రాంతాలలో పేదలకు ఇండ్లు, త్రాగునీటి సమస్య, కుల వివక్షతకు వ్యతిరేకం జరిగిన పోరాటంలో ముఖ్యభూమికి పోషించారన్నారు. గుంపెల్లగూడెం గ్రామాభివృద్ధిలో ఎర్రబెల్లి లక్ష్మయ్య పాత్ర మరవలేనిదన్నారు. నైతిక విలువలకు కట్టుబడి, ఎర్రజెండాను భుజాన మోసి కడవరకు ఎర్రజెండా నీడనే చేదతీరిన ఆదర్శ కమ్యూనిష్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య అని అన్నారు. ఎర్రబెల్లి లక్ష్మయ్య ఆచరించిన సిద్దాంతం, పోరాట స్పూర్తి అనుసరనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం)జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, మండల కమిటీ సభ్యులు గుర్రం వెంకన్న, నాయకులు పాపినేని నాగేశ్వరరావు, గుంపెళ్లగూడెం శాఖ కార్యదర్శి లక్ష్మయ్య చిన్న కు మారుడు ఎర్రబెల్లి సతీష్, పెద్ద కుమారుడు రాము, నాయకులు పొట్లకాయల రమేష్, ప్రజా నాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, భాగం వెంకటప్పారావు, వేములపల్లి రమణ, కళాకారుడు ఎర్రబెల్లి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

# 24న కోటమైసమ్మతల్లి జాతర దుకాణాలకు వేలం

- ట్రస్ట్ చైర్మన్ పర్సాపట్టాభిరామారావు, ఈవో కె. వెంకటయ్య



**కారేపల్లి, జూలై 21, ప్రజా జ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రసిద్ది చెందిన అతి పెద్ద జాతర సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయల పల్లికోట మైసమ్మ తల్లి జాతర. రాబోవు దసరా పండుగ సందర్బంగా ఐదు రోజుల పాటు నిరాటంకంగా జరిగే జాతర ఏర్పాట్లకు దేవాదాయశాఖ అధికారులు సమాయత్తం అ య్యారు. దానిలో భాగంగా దసరా సందర్బంగా ఆలయ ప్రాంగణంలో 11 రో జుల పాటు దుకాణాలు, ఏర్పాటు చేసుకోవటానికి బహిరంగ వేలం పాటలను ఈనెల 24వ తేదిన నిర్వహించటం జరుగుతుందని ఆలయ ఈవో కటుకూరి వెంకటయ్య, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ పర్సా పట్టాభి రామారావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రీ అమ్మకాలకు, లడ్డు, పులిహోరా దుకాణానికి, పుట్నాలు, పేలాలు అమ్ముకోవటానికి, కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకునే హక్కు, మిఠాయి దుకాణం, ఐస్ క్రీమ్ లు అమ్ముకోవటానికి వంటి 6 అంశాలపై వేలం పాటను నిర్వహిస్తున్నట్లు వా రు తెలిపారు. ఈ వేలంపాటకు ధరావతు సొమ్ము చెల్లించి పాటలు పాల్గొనవల సి ఉంటుందని వారు పేర్కొన్నారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రీ అ మ్మకాలకు రూ.లక్ష, లడ్డు, పులిహోరా దుకాణానికి రూ.50 వేలు, పుట్నాలు, పేలాలు అమ్ముకోవటానికి రూ.30వేలు, కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకునే హక్కు కు రూ. 30వేలు, మిఠాయి దుకాణం కు రూ. 30 వేలు, ఐస్ క్రీమ్ అమ్మకాలకు రూ.30 వేలు డిపాజిట్ చేసి వేలంకు హాజరు కావాల్సి ఉంటుందనితెలిపారు. హెచ్చు పాటదారులకు హక్కులు కల్పించటం జరుగుతుందని తెలిపారు.

# ఆర్టీసీ బస్సులో చోరుల చేతివాటం

**కల్లూరు, జూలై 21: ప్రజా జ్యోతి** ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు చెందిన బంగారు గొలుసు, నగదును గుర్తుతెలియని దొంగలు అపహరించిన ఘటన కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం రామకృష్ణ పురానికి చెందిన ఐతరాజు సుమలత ఈ నెల 20వ తేదీ సాయంత్రం సుమారు నాలుగు గంటలకు కల్లూరు బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సులో రామకృష్ణ పురానికి ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఆమె వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్ ను కత్తిరించి అందులోని పర్సును అపహరించారు. పర్సులో సుమారు 23 గ్రాముల బంగారు గొలుసు తో పాటు రూ 9 వేల నగదు ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.